ప్రజాశక్తి
బుధవారం 10 జనవరి 2024
5
విజయనగరం





కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్లు మంగళవారం విజయవాడలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎస్.ఎం.దీపిక, కలెక్టర్ నాగలక్ష్మి

ఎస్మా ప్రయోగించినా...అరెస్టులు చేసినా..ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించినా మొక్కవోని దీక్షతో అంగన్వాడీలు తమ పోరాటాన్ని సాగిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె నెలరోజులుకు చేరుకుంటున్నా సడలని సంకల్పంతో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని విధాలుగా బెదిరించిన, సమ్మెను నిషేధిస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా వారంతా అదర లేదు..బెదరలేదు. తమ సమస్యలు పరిష్కరించేవరకు పోరాడుతామని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరిస్తున్నారు.



చీపురుపల్లిలో దండాలు పెడుతూ నిరసన తెలపుతున్న అంగన్వాడీలు



విజయనగరంలో నిరసన దీక్షలు కొనసాగిస్తున్న అంగన్వాడీలు

సడలని సంకల్పం

నేటితో 30వ రోజుకు చేరనున్న అంగన్వాడీల సమ్మె ● ఎస్మాకు వెరవకుండా ఉధృతంగా నిరసనలు

ఇవీ డిమాండ్లు

- ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడుతున్న కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా తెలంగాణా కన్న అదనంగా వేతనాలు పెంచాలి
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలి.
- మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలకు పెంచాలి. ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలి.
- హెల్పర్ల ప్రమోషన్లో నిర్ధిష్టమైన నిబంధనలు రూపొందించాలి. రాజకీయజోక్యం అరికట్టాలి.
- సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. రూ.10 లక్షలు బీమా అమలు చెయ్యాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి
- లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలి. ఎస్ఆర్ఎస్ రద్దు చెయ్యాలి. ప్రీస్కూల్ బలోపేతం చెయ్యాలి.
- ఎస్ఆర్ఎస్, వివిధ రకాల యాప్ లను రద్దు చేసి ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలి.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలి.
- పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 నుండి టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

ప్రజాశక్తి-చీపురుపల్లి

జగన్మోహనా! నీకు దండం పెడతాం మా న్యాయమైన సమస్యలు పరిష్కరించి పుణ్యం కట్టుకో' అంటూ అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు బలగ నాగమణి మాట్లాడారు. పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు.

విజయనగరంటౌన్ : కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్ష కొనసాగింది. దీక్షలను ఉద్దేశించి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలు సమ్మె చేపట్టి 29 రోజులు కావస్తున్నా ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చేయకుండా మీనా మెషాలు లెక్కించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కె.సురేష్, నాయకులు టివి రమణ, బి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, జెవివి సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.సుధారాణి, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.**జామి :** సమ్మెలో భాగంగా బోగి పిడకలు కొట్టి నిరసన తెలిపారు. పండగ సందర్భంగా నైనా జగన్ మొండి వైఖరి విడనాడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. **శృంగవరపుకోట :** ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా గల సమ్మె శిబిరం నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా దేవిబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు డి.జయలక్ష్మి, దంతేశ్వరి, కోటలక్ష్మి, వి.మాణిక్యం, డి. సుశీల పాల్గొన్నారు.

గజపతినగరం : ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని, యూనియన్ తో చర్చిలు జరిపి వెంటనే సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు యుటిఎఫ్ నాయకులు సిహెచ్ భాస్కరరావు, కిల్లాడ అప్పారావు, రాంప్రసాద్ తదితరులు మద్దతు తెలిపారు. పోరాట నిధి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం.సుభాషిని, సెక్టార్ లీడర్లు డి.నాగమణి, నారాయణమ్మ, రవణమ్మ, వాణి, పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో వినూత్న నిరసన తెలిపారు. రాజకీయ నాయకుల మాస్కులు ధరించి అంగన్వాడీలపై కొరడా ఝుళిపిస్తున్న రీతిలో, చేతులు పైకెత్తి నమస్కారాలు చేస్తూ నిరసన తెలిపారు. **బొబ్బిలి :** అంగన్వాడీల పోరాటానికి ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు టి.అప్పలనాయుడు మద్దతు ప్రకటించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, కామేశ్వరి, ఉమాగౌరి,పద్మ, తదితరులు పాల్గొన్నారు. **రాజాం :** తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది. సిఐటియు నాయకులు రామ్మూర్తి నాయుడు మాట్లాడారు.



గజపతినగరంలో బిక్షాటనతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



జామిలో భోగీ పిడకలు కొడుతూ నిరసన



మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి వద్ద బైఠాయించిన సర్వశిక్ష ఉద్యోగులు

విద్యాశాఖా మంత్రి ఇంటి వద్ద

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

నగరంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతై సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ నుంచి మూడు లాంతర్లు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు బాధాకర మన్నారు. తామేమీ కొత్త కోర్కెలు కోరడం లేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నది తప్ప తమ కష్టాన్ని గుర్తించడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గురువులు, శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

అంబేద్కర్ త్యాగాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-విజయనగరం

సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన పోరాటాలు, త్యాగాలు స్ఫూర్తి దాయకమని రాష్ట్ర షెడ్యూల్డు తెగల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో అందరూ పయనించాలని కోరారు. విజయవాడలో ఈనెల 19న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని జనవరి 9 నుంచి 18వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ తన క్యాంపు కార్యాలయంలో ఒబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన



టిడిపి-జనసేన కూటమి విజయం ఖాయం

మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు

ప్రజాశక్తి- బొబ్బిలి

రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు అన్నారు. రాజా కళాశాల మైదానంలో బుధవారం జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపికి ఆదరణ లభిస్తోందన్నారు. చంద్రబాబు సభలు జయప్రదం అవుతున్నాయని, బొబ్బిలి సభ కూడా జయప్రదం అవుతుందని తెలిపారు.

నేడు ముగ్గురు సర్పంచులు చేరిక

చంద్రబాబు సమక్షంలో ముగ్గురు వైసిపి సర్పంచులు టిడిపిలో చేరనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన చెప్పారు. రాజా కళాశాల మైదానంలో చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన కూడా పరిశీలించారు. ఈ సభకు బొబ్బిలి గర్జన సభగా నామకరణం చేశామన్నారు.

చీకటి రోజులు పోవాలంటే టిడిపి రావాలి

రాష్ట్రంలో చీకటి రోజులు పోవాలంటే టిడిపి రావాలని టిడిపి పరిశీలకులు కూన రవికుమార్ అన్నారు. వైసిపి అరాచక పాలనపై బుధవారం రాజా కళాశాల మైదానంలో చంద్రబాబు బొబ్బిలి గర్జన సభను జయప్రదం చేయాలని కోటలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అహంకారం పోవాలంటే జగన్ పోవాలన్నారు. టిడిపి, జనసేన అధికారంలోకి వస్తే చీకటి రోజులు పోయి మంచి రోజులు వస్తాయన్నారు. సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన తదితరులు పాల్గొన్నారు

బొబ్బిలిలో నేడు రా.. కదలిరా

బహిరంగ సభకు చంద్రబాబు రాక ● తెలుగు తమ్ముళ్లలో ఉత్తేజం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం కనిపిస్తోంది. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం జిల్లాకు రానున్నారు. బొబ్బిలిలోని రాజా కాలేజి మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు ఆ పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. తెలుగు తమ్ముళ్లను భారీగా తరలించేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేశారు. ఇప్పటికే గ్రామ స్థాయిలో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల వాతావరణం దగ్గరపడడంతో వైసిపి, టిడిపిల ప్రచారం ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే 'రా... కదిలి రా' అనే కార్యక్రమంలో భాగంగా అధినేత చంద్రబాబు మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఇటీవలే భోగాపురం మండలం పోలిపల్లిలో నిర్వహించిన యువగళం విజయోత్సవ సభకు హాజరైన సంగతి తెలిసిందే. ఈసారి బొబ్బిలి వేదికగా విజయనగరం - పార్వతీపురం మన్యం జిల్లాల కేడర్‌కు బాబు దిశానిర్దేశం చేయనున్నారు. బొబ్బిలి కేంద్రం ఈ రెండు జిల్లాలకు సమాంతర దూరంలోనూ, పార్టీకి కాస్త బలమైన నియోజకవర్గంగాను గుర్తించిన పార్టీ ఇక్కడ సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్టుగా టిడిపి నాయకులు చెబుతున్నారు. బాబు వరుస పర్యటనలతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ కనిపిస్తోంది. విజయనగరం, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి ఒకింత క్లారిటీగానే ఉంది. గజపతినగరం, నెల్లిమర్ల, ఎస్.కోట ఎవరికి కేటాయిస్తారనేది తేలాల్సివుంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లోని ఆశా వహులు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బహిరంగ సభకు వస్తున్న నేపథ్యంలో బాబు దృష్టిలో పడేందుకు కూడా తహతహలాడుతున్నారు. గత నెల 20న పోలిపల్లి బహిరంగ సభ మాదిరిగానే దారిపొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నేడు జరగనున్న బహిరంగ సభల్లో కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేయడం, వైసిపిలోనూ, ప్రభుత్వంలోనూ లోపాలను, అమలుకాని హామీలను ఎత్తి చూపడమే బాబు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

బాబు జిల్లా పర్యటన ఇలా..


బుధవారం ఉదయం 10.15గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టులో బయలుదేరి, 11గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి బొబ్బిలి రాజా కాలేజీ మైదానానికి 11.40గంటలకు చేరుకుంటారు. 12గంటలకు సభ ప్రారంభమై 1.30గంటలకు ముగుస్తుంది. అనంతరం 2.30గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మిగిలిన గంట వ్యవధిలో పార్టీ కీలక నాయకులు, కార్యకర్తలతో జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించే అవకాశం ఉంది.

ఏర్పాట్లు పరిశీలన

బొబ్బిలి : బహిరంగ సభ ఏర్పాట్లును మంగళవారం టిడిపి నాయకులు కిమిడి కళా వెంకటరావు, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి బేబినాయన, కూన రవికుమార్ తదితరులు పరిశీలించారు.

రామభద్రపురం : అశేష జనవాహినితో రా కదలి రా సభ విజయవంతమయ్యేలా కార్యకర్తలను తరలించుకు రావాలని బొబ్బిలి నియోజక వర్గ ఇంఛార్జి బేబీ నాయన పిలుపు నిచ్చారు. మండల పరిధిలో ముచ్చర్లవలసలో మంగళవారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతి రావు, సీనియర్ నాయకులు కనిమెరక శంకరరావుల ఆధ్వర్యాన చంద్రన్న రా కదలి రా సభపై పార్టీ శ్రేణులు తరలింపు పై ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు భాస్కరరావు, కర్రోతు తిరుపతిరావు, ముళ్ళు రాంబాబు పాల్గొన్నారు.

గజపతినగరం: బొబ్బిలిలో జరిగే రా..కదలిరా సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కోరారు. మంగళవారం గజపతినగరం పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రబాబు సభకు వేల సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహిరంగ సభకు సిద్ధమైన వేదిక

చంద్రబాబు సభ జయప్రదం చేయాలి

విజయనగరం కోట : బొబ్బిలిలో బుధవారం జరుగనున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు బహిరంగసభను జయప్రదం చేసేందుకు ఆ పార్టీ నాయకులు కిమిడి కళా వెంకటరావు, రాష్ట్ర పార్టీ పరిశీలకులు గణబాబు, పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ మంగళవారం అశోక్‌బంగ్లాలో సమావేశమయ్యారు. సభను జయప్రదం చేసేందుకు నాయకులను సమాయత్తం చేశారు.

19న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఈనెల 19న విజయవాడలో ప్రారంభించడం చరిత్రలో నిలిచి పోతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాల వివరాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంతో దేశంలో ప్రజాస్వామ్యం వెల్లివిరిసేలా అందరి జీవితాలలో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని 125 అడుగుల మేర నిర్మించి ప్రారంభించుకోవడం అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పట్నాన పైడిరాజు, రేగాన రూప దేవి, ధనలక్ష్మి, దుప్పాడ సునీత, పట్టా ఆదిలక్ష్మి,దాసరి సత్యవతి, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

నగరంలో గాజులరేగలోని సాయి నగర్ కాలనీలో ఎన్నో ఏళ్లనాటి తాగునీటి కల సాకారం అయ్యింది. మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సాయి నగర్‌లో నాలుగు పబ్లిక్ కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు నడిపిల్లి ఆదినారాయణ, కణుగుల రాజా, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా జాతీయ యువజనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 12వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి 2(ఎ) గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉపేంద్ర ముఖ్యఅతిథిగా విచ్చేసారు. 100 మంది ఎన్‌సిసి కాడెట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలని తీర్చిదిద్దేది మన ఆలోచనలేనని, 'కెరటం నాకు ఆదర్శం లేచిపడుతున్నందుకు కాదు పడిన లేస్తున్నందుకు' అంటూ ఉద్బోధించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి.శశి భూషణరావు మాట్లాడుతూ నేటి యువత రేపటి భవిష్యత్తుకు మార్గదర్శకం అని కొనియాడారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకొని సాధనకు కృషి చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ డివి రామమూర్తి మాట్లాడుతూ స్వామి వివేకనందుని ఆచార వ్యవహారాలను ఇప్పటి యువత ఆచరించాలని కోరారు. అనంతరం గాజులరేగ వరకు వివేకనందుని సూక్తులతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎం.సాయి దేవమని, సుబేదర్ మేజర్ పరేశ్వర్ సింగ్ , బి .ఎస్.బొడెలే , కెప్టెన్. ఎం. సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం. వరలక్ష్మి, లెఫ్టినెంట్ ఎస్. ప్రశాంత్ పాల్గొన్నారు.



ఎన్‌సిసి కేడెట్‌కు బ్యాడ్జీ ధరిస్తున్న కల్నల్ ఉపేంద్ర, శశిభూషణరావు

గ్రామాల పురోభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామాలు అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి సమగ్రమైన ప్రణాళికలను రూపొందిచాలని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ప్రజా ప్రణాళిక 2024-25పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం జెడ్‌పి సమావేశ భవనంలో ప్రారంభమైంది. ముఖ్యఅతిధిగా హాజరైన జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ, సమగ్ర అభివృద్ధి కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పటిష్టమైన ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ప్రణాళికలు రూపొందిండచమే కాకుండా, వాటిని సమర్ధవంతంగా అమలు చేసినప్పుడే ఫలితాలు సిద్దిస్తాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పడే మంచి ఫలితాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. ప్రణాళికలను రూపొందించేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలను పరిగిణనలోకి తీసుకొని, తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని చెప్పారు. ఆరోగ్యకరమైన గ్రామాలను రూపొందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. దీనికోసం పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగ్గా అమలు చేయాలని సూచించారు. ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించాలని కోరారు. ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులను సక్రమంగా వినియోగించాలన్నా, అభివద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నా, ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు చాలా అవసరమని చెప్పారు. జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిపిఒ శ్రీధర్ రాజా, టిఒటిలుగా ఎంపికైన ఎంపిడిఒలు, ఇఒ పిఆర్‌డిలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యు ఎస్‌ఇలు, పంచాయతీ కార్యదర్శులు, తాహశీల్దార్లు, జెడ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

13న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీలలో నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 13వ తేదీన మండల స్థాయి పోటీలు నియోజకవర్గంలో ఐదు మండలాలలో నిర్వహిస్తామన్నారు. ప్రతి మండలం నుండి ఐదుగురు విజేతలకు మొదటి బహుమతి రూ.8వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, 3వేలు, 2వేలు, 2వేలు చొప్పున ఐదుగురికి ఇస్తామన్నారు. ఇలా ఐదు మండలాల నుంచి 25 మందిని 14వ తేదీన ఎస్‌కోటలోని ఆకుల డిపో వద్ద గల మైదానంలో ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. ఇందులో విజేతలకు ప్రథమ బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, 10వేలు, 5వేలు, 5వేలు చొప్పున బహుమతులు ఇస్తామన్నారు. ఈ పోటీలకు ఎటువంటి రుసుము తీసుకోమని పాల్గొనదలచిన వారు ఎవరు రంగులు వారే తెచ్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో రాయవరపు చంద్రశేఖర్, టిడిపి ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

భారత విద్యా వైతాళికులు ఫాతిమాషేక్ జయంతి సందర్భంగా పేదలకు అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సారు సాంబయ్య దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని సంఘవీధిలో మంగళవారం ఫాతిమాషేక్ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అప్పారావు, రమేష్, షేక్ ఫిదా ఫాతిమా పాల్గొన్నారు.

సొండి కులస్తులను ఆదుకోవాలి

ప్రజాశక్తి – బొబ్బిలి

కుల వృత్తి కోల్పోయిన సొండి కులస్తులను ఆదుకోవాలని సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆరికెవి చౌదరి, బెహర రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు కోరారు. బుధవారం చంద్రబాబు బహిరంగ సభలో సొండి కులస్తులను ఆదుకోవాలని కోరుతూ చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట సారా తయారు చేసుకుని సొండి కులస్తులు జీవనోపాధి పొందేవారని, సారా నిషేధంతో కులవృత్తిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వలే రాష్ట్రంలో సొండి కులస్తులకు వైన్ షాపుల కేటాయింపులో రిజర్వేషన్ కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అబ్కారీ శాఖలో ఉద్యోగాలు ఇవ్వాలని, రాజకీయ పదవులలో ప్రాధాన్యత ఇవ్వాలని, బిసి-డి నుంచి బిసి-ఎ లోకి మార్చాలని, సొండి కులస్తులను ఒబిసిలో చేర్చాలని డిమాండ్ చేశారు.

దశలవారీ మద్య నిషేధం ఎక్కడ?

ప్రజాశక్తి – బొబ్బిలి

అధికారంలోకి వచ్చాక దశల వారీగా మద్య నిషేధం చేస్తామంటూ హామీ ఇచ్చిన ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు మద్యం అమ్మకాల్లో దూసుకుపోతున్నారని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. మద్యంపై ఆదాయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వెళ్తామని చెప్పిన పెద్దమనిషి నూతన సంవత్సరం సందర్భంగా అర్ధరాత్రి వరకూ అనుమతులు ఇచ్చి మరింత ఆదాయాన్ని పెంచుకున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డిసెంబరు 31 ఒక్క రోజుకు 147 కోట్ల రూపాయల విలువైన మద్యం విక్రయం చారన్నారు. ఇదేనా దశలవారీ మద్య నిషేధం అని ప్రశ్నించారు.

నేడు ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదిక

ప్రజాశక్తి – రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు 16వ విడత సామాజిక ప్రజా వేదిక చర్చకు ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరుకావాలని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2022-2023 ఏడాదికి సంబంధించి 17 కోట్ల రూపాయలకు గ్రామ పంచాయతీల వారీగా వివిధ పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గత 15 రోజులుగా గ్రామపంచాయతీలో సోషల్ ఆడిట్ సిబ్బంది తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్ పూర్తయిన పంచాయతీల్లో గ్రామ సభలు చేపట్టామన్నారు. సామాజిక ప్రజా వేదిక చర్చలో ఎస్ఆర్పి, డిఆర్‌పిలు గ్రామపంచాయతీలో పనులు చదువుతారని అన్నారు. ఈ సామాజిక ప్రజావేదికకు ఉన్నతాధికారులు రానున్నట్లు వెల్లడించారు.

అత్యధిక మెజారిటీ సాధించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి – గజపతినగరం

గత ఎన్నికల కంటే 2024లో రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేది నుండి మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికలకు సమాయత్తం చేస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా శ్రమించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపు నిచ్చారు. చంద్రబాబు ఇచ్చే మోసపూరిత, అబద్ధపు హామీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. గతంలో ఇచ్చిన హామీల మేనిఫెస్టోని ఏ విధంగా పక్కన పెట్టారో ప్రజలు ఇంకా మరచిపోలేదని, డ్వాక్రా అక్క చెళ్ళమ్మల నుండి అవ్వతాత వరకు అందరిని మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, పార్టీ నాయకులు మండల సురేష్ తది తరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఎపి సిపిఎస్ కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి – తెర్లాం

ఎపి సిపిఎస్ మండల కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల కేంద్రంలో సిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీరాములు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గానికి గౌరవ అధ్యక్షులుగా సాకేటి గణపతి, సలహాదారుగా గేదెల శంకర్రావు, అధ్యక్షునిగా బూరి తవిటినాయుడు, ప్రధాన కార్యదర్శిగా బత్తిన సురేష్, ఉపాధ్యక్షులుగా కిల్లాడ రాము, మహిళా అధ్యక్షులుగా జ్యోతిలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా చింత సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులుగా మీసాల అప్పలస్వామి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా అల్లు సుధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ప్రమాణ స్వీకారం అనంతరం జిల్లా ఎపి సిపిఎస్ ఇఎ 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాద్యులు పత్తికాయల సత్యనారాయణ, గర్భాపు రాజశేఖర్, సిపిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వేపాడలో 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి– వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను బుధవారం నిర్వహించనున్నామని ఇంఛార్జి ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి ఉమా తెలిపారు. 18 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారందరికీ ఇక్కడ మండల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. పంచాయతీ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను తీసుకువచ్చే బాధ్యత పంచాయతీ కార్యదర్శి వహించాలని ఆమె తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు.

పండగపూటా పంగనామాలేనా ?

ప్రజాశక్తి – విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరింది. ప్రభుత్వం ప్రస్తుతం పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న జీతం రూ.15వేలు, ఆరోగ్య భృతి రూ.6వేలు కలిపి రూ.21వేలు జీతంగా ఇస్తామని, ఇదే ఎక్కువ అనే విధంగా మంత్రులు మాట్లాడుతున్నారని యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ జగన్మోహన్‌రావు, నాయకులు కుమారి, రాఘవ మండిపడ్డారు. ఎన్నికల ముందు లక్ష రూపాయలు జీతం ఇచ్చిన తక్కువేనని, పర్మినెంట్ చేస్తామని చెప్పి, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఇప్పుడు అమలు చేయకుండా మున్సిపల్ కార్మికులకు పంగ నామాలు పెట్టి, చెవిలో పువ్వులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెల్లిస్తామన్న రూ.21 వేలకు అదనంగా మరొక రూ.3వేలు పెంచి రూ.24 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటర్ వర్క్స్, పంపు హౌస్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21 వేలు అమలు చేయాలని కోరుతున్నామని ప్రభుత్వం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె శిబిరంలో సూరి, గౌరీ, రమణ, వెంకట్, రమా, లక్ష్మి, ఈశ్వరమ్మ, వంశీ పాల్గొన్నారు.



విజయనగరం : బిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బిక్షాటన చేసిన మున్సిపల్ కార్మికులు

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మున్సిపల్ కార్మికులు భిక్ష వేయండి అని నినాదాలు చేసుకుంటూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి గంట స్థంభం మీదుగా ప్రతి దుకాణాలకు వెళ్లి బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, యూనియన్ నాయకులు తుపాకుల శ్రీను, కళ్యాణ శ్రీను, దశమంతుల గణేష్, చిరంజీవి, సత్తిబాబు, యర్రంశెట్టి నాని, బండి రాము, సబ్బవరపు రామియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మె మంగళవారం కొనసాగింది. జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే పంగనామం

బొబ్బిలి: కాంట్రాక్టు కార్మికులకు పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పంగనామం పెట్టడం ఖాయమని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు సిఎం జగన్మోహన్‌రెడ్డిని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు పంగనామాలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని పాదయాత్ర, ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చిన్నప్పటికి అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేయకపోతే ఎన్నికల్లో మీకు పంగనామం పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరీష్, వాసు, యుగంధర్, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

రాజాం: మున్సిపల్ కార్మికులకు జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులకు పంగనామాలు పెట్టడాన్ని కార్యక్రమంలో తీవ్రంగా విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే ఆర్థికపరమైన అంశాలు ఇప్పుడు అమలు చేయలేమని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో హామీ ఇచ్చినప్పుడు అమలు చేయగలమో చేయలేమో అని ఇంకిత జ్ఞానం కూడా జగన్మోహన్ రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. హామీలను అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకపోతే ఈ సమ్మె పోరాటం హామీలు అమలయ్యే వరకు కొనసాగుతాయని హెచ్చరించారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, హరి, కృష్ణ శారద, మరియ దాస్, అప్పలరాజు, రమణ, లక్ష్మి, గురువులు, రాంబాబు, వెంకటి, సింహాచలం, గోపి, కృష్ణ, రాజేష్, కనకరాజు, గిరిబాబు,తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసనలు



బొబ్బిలి: పంగనామాలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పేదలకు వరం ఆరోగ్య సురక్ష : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి–నెల్లిమర్ల

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణరాజు పేర్కొన్నారు. మంగళ వారం మొయిద విజయరాం పురం గ్రామ సచివాలయంలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు (సురేశ్ బాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమన్నారు. ప్రతీ సచివాలయంలో పేదలకు వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించే విధంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ధీర ఫౌండేషన్ ద్వారా గ్రూప్– 2 పరీక్షలకు నిరుద్యోగ యువతకు, స్థానిక గ్రంథాలయానికి పుస్తకాలు, నూతనంగా మంజూరైన రూ.3వేల పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, వైస్ ఎంపిపి పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎ.కృష్ణ, వైసిపి నాయకులు గంటా అప్పల రాజు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చింతలవలసలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు ప్రారంభించారు. స్పెషలిస్టు డాక్టర్లు చాణుక్య, ఎ. శ్రీనివాస్, మోపాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జి. శరణ్య 300 మంది రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



మందులను అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పిఎఒ మజ్జి గణపతిరావు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలవలస–1 సచివాలయం సిబ్బంది, మోపాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సర్పంచ్ శర్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు రమాదేవి, రాజశేఖర్ 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు, పంచాయతీ కార్యదర్శులు అప్పలనాయుడు, గంగాధర్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి–శృంగవరపుకోట

పట్టణంలోని చెరుకు కాటా వద్దగల గెడ్డ పోరంబోకు భూమిని కొందరు ఆక్రమించి పాకలు నిర్మించారు విషయం తెలుసుకున్న తాహశీల్దార్ సంఘటన స్థలానికి జెసిబితో వెళ్లి వాటిని మంగళవారం తొలగించారు. ఆక్రమితుదారులు తమకు న్యాయం చేయాలని, ఇంటి అద్దెలు కట్టలేక పాకలు వేశామని మొరపెట్టుకున్నారు. తహశీల్దార్ స్పందిస్తూ దరఖాస్తు చేసుకుంటే 90 రోజులు స్కీం కింద జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇస్తామని బాధితులకు తెలిపారు



ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

హెచ్చరిక బోర్డులు తొలగించి పభుత్వ స్థలాలు కబ్జా

బొబ్బిలి : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ. ఐటిఐ కాలనీలో భూకబ్జాలపై గతంలో స్పందించిన రెవెన్యూ యంత్రాంగం ఆ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని, కానీ భూకబ్జాదారులు అధికార పార్టీ నాయకులు పేర్లు చెప్పుకొని ఆ బోర్డులను పక్కనపెట్టి యథాతదంగా ఇళ్ల కట్టడాలు చేపడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మున్సిపల్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్. టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూలు చెల్లించి అధికార పార్టీ నాయకుల అండదండలతో రెవెన్యూ, మున్సిపల్ యంత్రంగాలకే చుక్కలు చూపెడుతున్నారని ఆరోపించారు. ఎటువంటి ఇళ్ల స్థలాలు కబ్జాలు జరగలేదని స్థానిక ఎమ్మెల్యే గారు చెప్పి వారం రోజులు గడవకముందే భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. ఈ భూ కబ్జాలపై త్వరలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో కోట అప్పన్న, బొద్దాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి–విజయనగరం

స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బొమ్మల కొలువు దగ్గర దీపారాధన చేసి కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు సంబరాలను ప్రారంభించారు. తరువాత గంగిరెద్దులు ఆడించడం, హరిదాసులు గీతాలు, ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగురవేయడం, తెలుగు అబ్బాయి మరియు తెలుగు అమ్మాయి పోటీలు, భోగీ మంటలు, చిన్న పిల్లలకు భోగి పళ్ళు పోయటం, సాంప్రదాయ పిండివంటలు ప్రదర్శన ఇలా అనేకరకాల కార్యక్రమాలను తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించారు. తరువాత విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులు పాటలు పాడి మరియు నత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం. సత్యవేణి, ఎం.ఉదయ్ కిరణ్, ఎన్‌సిసి ఆఫీసర్ బి. సూరపు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: హరిదాసు వేశధారణలో చిన్నారులు

నారాయణ పబ్లిక్ స్కూలులో మిన్నంటిన సంబరాలు

విజయనగరం కోట : సనాతన సంప్రదాయాలను విలువలను పిల్లల్లో పెంపొందించాలని తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు అన్నారు. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. తెలుగమ్మాయిల వేషధారణలు, రైతు వేషధారణ, హరిదాసు, బసవన్న, సోదమ్మ, కోలాటం, గాలిపటాల పోటీ ప్రదర్శనలు విద్యార్థుల్లో ఎంతగానో ఆనందాన్ని నింపాయి. ముగ్గులతో గొబ్బెమ్మలు పెట్టి విద్యార్థిని విద్యార్థులు చేత నృత్యాలు చేయించడం ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు పాఠశాలలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



విజయనగరం కోట: సాంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని పలు పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిపల్లి వద్ద గల సెంట్ మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో, పోతనపల్లి వద్ద గల మైత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్, భవాని నగర్ వద్దగల గౌరీ విద్య నికేతన్‌లోను సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోది చెప్పడం, హరిదాసు వేషధారణ, రంగోలి, భోగి మంటలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: సంక్రాతి ప్రయాణీకుల కోసం స్థానిక డిపో నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్సులు ఎస్‌కోట డిపో నుండి ఈ నెల 10 నుంచి 12 వరకు హైదరాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో 11న నుంచి 13 మధ్యలో హైదరాబాద్ బెల్ నుంచి ఆయా రోజుల్లో 18.45 నిముషాలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. సాధారణ చార్జీలతో బస్సులను నడుపుతున్నామని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశకి–నెల్లిమర్ల

చిన బూరాడపేటలో మంగళవారం పింఛన్ల పంపిణీ జరిగింది. చిన, పెద బూరాడ పేట గ్రామాల పరిధిలో నూతనంగా పెంచిన పింఛన్ల ను తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, నాయకులు బెల్లాన రామారావు, మక్కువ రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఫోటో: పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

ప్రజాశక్తి – నెల్లిమర్ల

అంగన్ వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని సిపిఐ నాయకులు మొయిద పాపారావు అన్నారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీల సమస్యలు పరిష్కారించకుండ వారు న్యాయంగా చేస్తున్న సమ్మెపై ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ఎస్మాను వెంటనే ఉపసంహరించుకొని అంగన్ వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుతోనే బ్రాహ్మణ అభివృద్ధి

ప్రజాశక్తి–విజయనగరం కోట

బ్రాహ్మణుల అభివృద్ధి చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని విజయనగరం పార్లమెంట్ టిడిపి బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ ఇనుగంటి రాకేష్ శర్మ అన్నారు. మంగళవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత టిడిపిదేనని అన్నారు. కార్పొరేషన్‌కు రూ.300కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ బ్రాహ్మణ కార్పొరేషన్ కు ఈ నాలుగేళ్లలో ఒక్క పైసా కూడా ఇవ్వకుండా బ్రాహ్మణులను తీవ్రంగా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి పాలక వర్గాన్ని నియమించకుండా నాలుగేళ్లు కాలయాపన చేసి,తెలంగాణ నుంచి ఒక వ్యక్తిని ఇంచార్జ్ గా తెచ్చి సొసైటీ లో ఉన్న వందల కోట్ల బ్రాహ్మణుల డబ్బును అగ్రహారాల పేరుతో పక్కదారి పట్టించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. రామతీర్థం దేవాలయం లో శ్రీరాముడు విగ్రహాన్ని ధ్వంసం చేసి నాలుగేళ్లు అయినా ఇంతవరకు నిధితులను పట్టుకోలేకపోవడం ప్రభుత్వ తీరుకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో వడ్లమాని సుభద్ర, వడ్లమాని శేఖర్, మర్ల రవికుమార్, నందగిరి శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు బొగ్గావరపు శంబునాథ్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు తనిఖీలు

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం బాణాదికి చెందిన సత్యసాయి సేవా ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఏ. ధరణి, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న వైద్యులు

ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు

ప్రజాశక్తి– బొబ్బిలి

సిఎం జగన్మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు మంగళవారం నాటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణుల మధ్య వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి ఉండకపోతే అద్భుతమైన నవరత్నాలు అంది ఉండేవి కాదని గుర్తు చేశారు. ఎంతోమంది పేద బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన సిఎం జగన్మోహన్ రెడ్డి నాటి పాదయాత్రలో ప్రజల కష్టాలను, కన్నీళ్లను కల్లారా చూసి చలించి నవరత్నాలలో చెప్పినవే కాకుండా చెప్పనవి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

శృంగవరపుకోట: అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో డిఆర్‌డిఎ- వైకెపి, హౌసింగ్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం తదితర శాఖల ప్రగతిపై మంగళవారం ఎమ్మెల్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వైసిపితోనే ప్రజారంజక పాలన : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి– రేగిడి

ప్రజా రంజక పాలన వైసిపితోనే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి తలే రాజేష్ అన్నారు. మంగళవారం లక్ష్మీపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఐదేళ్ల పాటు లబ్ధిదారులకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైసిపి ప్రభుత్వం ధ్యేయమన్నారు. పేదవాడే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, ధవలేశ్వర రావు, సర్పంచ్ కెంబూరు తేజోవతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి ఎర్నేన అప్పలనాయుడు, కింజరాపు సురేష్, కె. శ్రీనివాసరావు, ముంజేటి కిషోర్, పిల్లా గౌరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల కేంద్రం పెదపల్లి వీధికి చెందిన పెదపల్లి భాస్కరరావు (27) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ చిన్నయ్య తెలిపారు. ఆయన చెప్పిన వివరాల మేరకు మృతుడు భాస్కరరావు బైపాస్ రోడ్ మీదుగా ఇంటికి వెళుతుండగా సాలూరు నుంచి ఎదురుగా బులెట్ పై వస్తున్న లోకేష్ బలంగా భాస్కరరావు వెళుతున్న స్కూటీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తలకు బలమైన గాయాలయ్యాయి. బుల్లెట్ పై వస్తున్న లోకేష్, మహేంద్రలకు కూడా గాయాలయ్యాయి. వెంటనే భాస్కరరావును బాడంగి సిహెచ్‌సికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. గాయాల పాలైన సబ్బవరం వాసులు లోకేష్, మహేంద్రలకు స్థానిక పిహెచ్‌సిలో వైద్య సేవలందిస్తున్నారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ చిన్నయ్య తెలిపారు.

చెరువులో జారిపడి మహిళ మృతి

భోగాపురం: భోగాపురం గ్రామంలోని సినిమా హాల్ ఎదురుగా ఉన్న చెరువులో ప్రమాదశాత్తు మహిళా మంగళవారం ఉదయం జారిపడి మృతి చెందింది. స్థానిక ఎస్‌సిబిసి కాలనీకి చెందిన పాండ్రంకి కొండమ్మ (53) ఎప్పటి మాదిరిగానే కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఉదయం చెరువు వైపు వెళ్ళింది. చెరువులో జారిపడి మృతి చెందింది. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

వంగర: 75 మద్యం బాటిళ్లతో ప్రయణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సింగిరెడ్డి తిరుపతిని మండలంలోని వివిఆర్ పేట సమీపంలో పట్టుకొని ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హెచ్‌సి దూసి రాములు మంగళవారం తెలిపారు.